


# ఆయా

ఆంగ్లమూలం: శివశంకరి
అనువాదం: ఎ.కృష్ణ

కథ

దాదాపు రెండు గంటలయింది.

సూర్యుడు నడినెత్తికొచ్చి నిప్పులు చెరుగుతున్నాడు.

వంటగది ముందు విశ్రాంతి తీసుకుంటున్న వడివంబల్ మెడ మడతలలో చెమట పట్టింది.

పక్కనున్న విసనకర్ర తీసికొని విసరుకొంది. చేయి నొప్పి పుట్టి, విసనకర్రను కింద పెట్టి, చీరకొంగుతో మెడను తుడుచుకుంది.

ఆమెకు నిద్ర పట్టలేదు.

లేచి కూర్చుంది. వెంటనే తల తిరిగినట్లైంది.

క్షణక్షణానికి బి.పి.పడిపోసాగింది. ఉన్నట్లుండి ఆమె ఛాతీ ఎడమప్రక్క నొప్పనిపించింది.

వడివంబల్ నిదానంగా లేచి వంటగదికెళ్లింది. ఫిల్టరులో ఒక స్పూను కాఫీ పౌడర్ వేసి, ఒక గ్లాసు వేడినీరు పోసి మూతపెట్టింది.

పెరట్లోకి చల్లగాలి కోసం వచ్చింది. ఫిల్టరు నుండి డికాషను వచ్చేవరకు తులసి చెట్టు ముందు కాళ్ళు చాచి కూర్చుంది.

మధ్యాహ్న సూర్యకాంతికి ఆమె కళ్ళు బైర్లు కమ్మాయి. ఒక కాకి వేడిని భరించలేక బావి చుట్టూ వున్న నీటిగుంటలో నీరు త్రాగి, పనసచెట్టు కొమ్మనీడన కూర్చొని నోరుతెరచి తలను ప్రక్కకు త్రిప్పి ప్రపంచాన్ని తిలకించింది.

కూర్చున్న చోటు నుండి వడివంబల్ జామ చెట్టుక్కాసిన పిందెలను చూసింది.

ఈ చెట్టు వయసెంత?

ఇరవై సంవత్సరాలు లేక ఆ పై వుండవచ్చు. మోహన్ పిల్లవాడుగా వున్నప్పుడు స్నేహితుడిచ్చాడని భర్త ఒక మొలకను తెచ్చి నాటాడు.

మోహన్‌కు పది సంవత్సరాల వయసు వచ్చేటప్పటికి చెట్టు త్వరగా పెరిగి కొమ్మలు వ్యాపించి బుట్టలనిండా పండ్లనివ్వటం మొదలెట్టింది.

ఏమదృష్టం - ఎందుకంటే పండ్లు క్రింద లావుగాను, కొనలు సన్నగాను వుండి నిమ్మపండు ప్రమాణంలో వున్నాయి. వాటిని కోస్తే లోపల ఎఱ్ఱగా వుండి తక్కువ విత్తనాలతో కండకలిగివున్నాయి. ఒకసారి నోట్లో వేసుకుంటే చక్కెరలా కరిగిపోతున్నాయి.

మోహన్ పిల్లవాడిగా వున్నప్పుడు ఈ చెట్టుపైనే వుండేవాడు.

స్కూలుకు సెలవులిస్తే అతని స్నేహితులు నానా రభస చేసేవారు.

మోహనుకు ఇప్పుడు పెళ్లయింది. మూడు నెలల బిడ్డ కూడా.

కుమారుని ఆలోచనలతో పాటు తన భర్తతో గడిపిన మధురస్మృతులు గుర్తుకురాగా ఆమె కన్నీరు కార్చింది.

రాజాలా బ్రతికినోడు క్షణంలో పోయాడు. నేనేమో ఇక్కడ రాయిలా పనికిరాని దానిలా తిష్టవేశా...

వచ్చే అక్టోబరుకు భర్త పోయి మూడు సంవత్సరాలవుతుంది. ఆలోచన ఆమెకు దుఃఖాన్ని కలిగించింది. స్తంభానికానుకొని కళ్ళు మూసుకుంది.

భర్త పోగా, కుమారుడు ఉత్తరాదిన వుండగా, అనాథలా ఆమె ఒంటరి జీవితం కన్నీటిని తెప్పించింది. మూసిన కళ్ళ నుండి బుగ్గలపై జాలువారాయి.

వడివంబల్‌కు ఇప్పుడు 58 ఏళ్ళు. రజస్వల కాకముందే పన్నెండవ ఏటనే ఆమె వైవాహిక జీవితంలోకి ప్రవేశించింది. భర్త నటేశన్ జీవించి వున్నంతవరకు ఆమె పిల్లలా అమాయకంగా బయటి ప్రపంచం తెలియక జీవించింది. ఆమె లోకం ఇల్లు, తోట, వంట, భర్త, కుమారుడే!

గ్రామంలో నటేశన్‌కు పదెకరాల పొలముంది. పంటలు బాగా పండేవి. గాదె నిండిన తర్వాత పండిన పంటను అమ్మి సంవత్సర భత్యం, భార్యకు చీరలు, బంగారు గాజులు, ప్రతి సంవత్సరం కొనేవాడు. భవిష్యత్తు కోసం ఇన్స్యూరెన్సు చేసి కొంత డబ్బును బ్యాంకులో దాచేవాడు.

మోహన్ పుట్టాక వాడిపై లేని ఆశలు పెట్టుకుంది. వడివంబల్ తండ్రి అడుగు జాడల్లో నడచి వారితోనే వుంటాడనుకుంది. కాని అది జరగలేదు. వాడేమో పై చదువులకెళ్ళి ఇంజనీర్ అయ్యాడు.

“ఈ గ్రామం అన్నా, ఈ ప్రాంతం అన్నా బొత్తిగా యిష్టంలేదు...” అని నిర్మొహమాటంగా చెప్పి ముంబాయిలో ఉద్యోగాన్ని చూసుకున్నాడు. అది 5 సంవత్సరాల క్రిందటి మాట.

“పోతే పోనీ” ఉండటానికి యిష్టం లేనటువంటి వాణ్ణి బలవంతం చేస్తే ఎలా?” అని తెలిసిన వారందరితో నటేశన్ చెప్పేవాడు. భర్త అంతర్మధనం వడివంబల్‌కు తెలుసు.


ఏమైనా జరగవలసింది జరిగిపోయింది.

కుమారుడు మంచి కుటుంబీకురాలిని వివాహమాడి అక్కడే స్థిరపడితే వాని పిల్లాపాపలతో ఆనందంగా గడపాలనుకున్నాడు. అమ్మాయిల వివరాలతో ఉత్తరాలు రాసేవాడు. కాని వాడు బదులివ్వకుండా వుండిపోయేవాడు.

ఒకసారి సెలవుపై ఇంటికి వచ్చినపుడు తల్లిదండ్రులు వాడితో పోట్లాటకు దిగారు. “నీ మౌనానికి అర్థమేమి? మమ్ము అర్థం చేసుకో” అప్పుడు

బయటపడింది అసలు కథ.

ముంబాయిలో ఒక అమ్మాయిని చూశాడని, ఆమె పేరు ఉషని, బాగా చదువుకుందని, అందమైందని, ఉద్యోగస్థురాలని, ఆధునిక భావాలు గలదని తెలుసుకున్నారు. కులాంతర వివాహానికి తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పినప్పటికి మోహన్ మనసు మార్చుకోవటానికి యిష్టపడలేదు.




నటేశన్, వడివంబల్ రెండు రోజుల పాటు సామ, దాన దండోపాయాలతో లొంగదీసుకోవాలని ప్రయత్నించారు. కాని వాని మొండి వైఖరి ముందు అవి ఏవీ పనిచేయలేదు. వారు నిరుత్సాహపడ్డారు.

ఆ సాయంకాలం కుమారుని కోరికను తెలుసుకున్న ఆమె భర్త పాదాలు పట్టుకొని వేడుకుంది. కన్నీరు బుగ్గలపై పడుతుంటే 'దయచేసి ఒప్పుకోండి... వాడు మన కోరిక కాదంటే ప్రేమబంధం చేదుబంధంగా మారుతుందేమో.

నటేశన్ ఆమె చెప్పింది ఒప్పుకున్నాడు. మరుసటిరోజు నిద్రలేస్తూనే కుమారునికి చెప్పాడు. దూరంగా తదేకంగా చూస్తూ... 'నీ యిష్టం వచ్చినట్లు చేయ్'.

ముంబాయిలో వివాహం జరిగింది.

గ్రామస్థులు, వారి కుమారుని వివాహం జరిపించిన తీరును గురించి మూలమూలలా గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. - వివాహానికి ఒకరోజు ముందు వెళ్ళి మరుసటి రోజుకల్లా తిరిగి వచ్చేశారు.

"వాడి కాళ్ళు విరగొట్టి సలసలకాగే నీళ్ళలో వేసేవాణ్ణి?"

"వాడే నా కొడుకైతే తప్పు చేసిన కుక్కలా తరిమేవేశేవాణ్ణి.

ఇదేమిటి వడిల్? వాడితో ఎలా ఏకీభవించావు? జాతకాలు చూడకుండా వాళ్ళ వివాహానికి ఎలా ఒప్పుకున్నావు?" -అని.



రకరకాల ప్రశ్నలు, రకరకాల విమర్శలు-నటేశన్ వడివంబల్ స్పందించక మౌనంగా వుండిపోయారు. తర్వాత ఎవరు లేనప్పుడు దుఃఖపడేవారు.

నటేశన్‌కు తనలో రగిలే మూగ బాధ యముని నుండి వచ్చిన పిలుపులా అనిపించింది.

తలనొప్పి, చాతీలో నొప్పి అంటూ అకస్మాత్తుగా పడిపోయాడు. నటేశన్ వడివంబల్ మూలికా కషాయం తెచ్చేలోపలే అతడు మరణించాడు.

టెలిగ్రాం అందిన మరునాడు 'పనులు ముమ్మరంగా వున్నాయంటూ మోహన్ దిగాడు. కొన్ని నిర్ణయాలతో వచ్చినట్లు అగుపించాడు. వడివంబల్ మూగబాధను పెడచెవిని పెట్టి ఎనిమిది ఎకరాల పొలాన్ని తెగనమ్మేశాడు. పశువుల పాకకెళ్ళి పొలాల్లో పనిచేసే ఎద్దులను అమ్మివేశాడు.

"ఎందుకు మోహన్? ఎందుకింత తొందర?" అడిగారు గ్రామ పెద్దలు.

"నేను ముంబాయిలో వుంటా, రావాలనుకున్నప్పుడు రాలేను. నా బాధ్యతలను తగ్గించుకొని అమ్మను నాతో తీసికెళ్దాం అనుకుంటున్నా" జవాబిచ్చాడు మోహన్.

మరుసటిరోజే తల్లిని ముంబాయికి తీసికెళ్ళాడు. గ్రామంలో విశాలమైన ముంగిలి, పెరటితోట పనులకు అలవాటు పడిన వడివంబల్‌కు నగర జీవితం జీర్ణించుకోవటం కష్టమనిపించింది. నిజం చెప్పాలంటే నవ దంపతులైన ఉషా మోహనులకు ఒక గ్రామీణ స్త్రీని ఇంట్లో వుంచుకోవడం మరింత కష్టమైంది.

ఆమె నేలపై కూర్చునే భోంచేసేది. గట్టిగా మాట్లాడేది. అందరిని ఇంటికి ఆహ్వానించేది. వారితో మాటా మాటా కలిపేది. రెండు నెలల కాలంలో వడివంబల్ గ్రామాచారాలు ఆ కుటుంబానికి నగరవాసులకు ఇబ్బందిగా మారాయి. ఆరు నెలల్లో కొడుకు కోడలికి ద్వేషం, కోపం తారాస్థాయినందుకున్నాయి. భార్యాభర్తలు ఉద్యోగం నుండి అలసివస్తే వారు ప్రైవేటుగా సంభాషించుకొనే వేళ 'ఏమిటి వార్తలు!' అని వడివంబల్ జోక్యం కల్పించుకునేది.

రాత్రి సినిమాలకు, స్నేహితుల పార్టీలకు వెళ్ళలేకపోయేవారు. "నేను ఒక్కదాన్నే రాత్రి వుండటం భయం' అని వడివంబల్ చెప్పుండేది. వంట చేసేటపుడు వంటగదిలో తళతళలాడే

టైల్సును కరాబు చేసేది. సభ్యత లేకుండా పోట్లాడేది. పనులు సక్రమంగా జరిగేవి కావు.

ఏడు నెలల తర్వాత మోహన్ తల్లితో "ఈ నగరం నీకు వంట పట్టటంలేదు కదూ?" నీవు వచ్చినప్పటి నుండి తలనొప్పి అని కాలునొప్పని చెప్తూనే వున్నావు. ఇక్కడ భాష అర్థం కాదు. ఇక్కడ ప్రజలతో కలసి పోలేక బాధపడుతున్నావు. నీవు గుడికి వెళ్ళాలనుకున్నప్పుడు వెళ్ళలేకపోతున్నావు. అందువల్ల... నే చెప్పేదేమంటే... గ్రామాని కి తిరిగివెళ్ళు మేము వచ్చి నిన్ను చూస్తుం టాము. ఇదే సరైన నిర్ణయమనుకుంటా" అన్నాడు.



రెండున్నర సంవత్సరాలైంది. ఈ మధ్యకాలం లో మోహన్ రెండు రోజులు చూడటానికి వచ్చాడు. వడివంబల్‌కు మనుమడు కలిగా డు. వాడికి మూడు నెలలొచ్చినా కోడలు, మనవడితో వడవంబల్‌ను చూడటానికి ఒక్కసారి కూడా రాలేదు. వారికి యిష్టం లేకుంటే రాకుంటే మానిలే. కాని నాకు ఒక్కసారైనా మనవణ్ణి చూపించరా?

కుమారుని మనసు అర్థం చేసుకుంది. వాడి మాటలోని అంతరార్థం అర్థమైంది. మారు చెప్పకుండా తన పెట్టా బేడా సర్దు కొని గ్రామానికి వచ్చేసింది.

గ్రామస్థులు ఆమెను ప్రశ్నలతో విసిగించే వారు.

"ఎందుకు తిరిగొచ్చావు?"

ఆవిడ సమర్థించుకుంటూ కథలల్లేది.

ఆ ముంబాయి నాకు నచ్చలేదు... ఎంతో ఇరుకు.

ఎంతో గందరగోళం. ప్రాంతీయ భాష తెలియకుండా అక్కడుండ టం చాలా కష్టం.

రెండున్నర సంవత్సరాలైంది. ఈ మధ్యకాలంలో మోహన్ రెండు రోజులు చూడటానికి వచ్చాడు. వడివంబల్‌కు మనుమడు కలిగాడు. వాడికి మూడు నెలలొచ్చినా కోడలు, మనవడితో వడవంబల్‌ను చూడటానికి ఒక్కసారి కూడా రాలేదు. వారికి యిష్టం లేకుంటే రాకుంటే మానిలే. కాని నాకు ఒక్కసారైనా మనవణ్ణి చూపించరా?

నిరాశగా వడివంబల్‌లేచి నిలబడింది. వంటగదిలోకెళ్ళింది. కలు పుకున్న రుచీపచీ లేని కాఫీ త్రాగింది. పెరట్లోకి వెళ్ళి మళ్లీ కూర్చుంది.

తన బాధను భగవానుడు గుర్తించినట్లుగా మరుసటి రోజు పోస్టు లో మోహన్‌నుండి ఒక ఉత్తరం వచ్చింది.

"నీవు ఒంటరిగా అక్కడ ఉండటం అంత బాగాలేదు.

నేను 4వ తారీఖున వస్తున్నాను. నాతో వచ్చేదానికి సిద్ధంగా వుండు" నాలుగు సంక్షిప్త వాక్యాలు.

వడివంబల్ సంతోషానికి అవధులు లేవు. పాలతో స్నానం చేసినట్లనిపించింది.

చేతిలో ఉత్తరం పట్టుకొని ఒక్కొక్క ఇంటికి వెళ్ళింది. "మీరు నా కుమారుని గురించి నీచంగా మాట్లాడుతారా? వాడు తల్లిని కూడా చూసుకోలేదంటారా? ఇంట్లో నుండి వెళ్ళగొట్టారని అంటారా? ఇప్పుడు ఏం చెపుతారు? ఉత్తరాన్ని వారి ముఖాల పై ఊపింది. రాబోయే రోజుల్లో వడివంబల్ తీరిక లేకుండా అయిపోయింది. సామాన్లు అన్ని మూటగట్టింది. ఇడ్లీ బియ్యం, ముతకబియ్యం పాకెట్లు కట్టింది. రకరకాల తినుబండారాలు, పొడులు, ఊరగాయలు, అప్పడాలు, అటుకులు చేయటం మొదలెట్టింది.

అనుకున్న ప్రకారం మోహన్ వచ్చాడు. తల్లిని తీసికెళ్లాడు.

వడివంబల్ నవ్వును ఆపుకోలేకపోయింది.

ముంబాయికి చేరుకున్నారు.

మనవడు సన్నగా బలహీనంగా వున్నాడు. ఇల్లంతా అస్తవ్యస్తంగా వుంది. కోడలికి ఆఫీసులో పనిఒత్తిడి ఎక్కువయింది. ప్రసూతి సెల వును పొడిగించటానికి యాజమాన్యం తిరస్కరించింది. ఆమె ఆఫీసుకు హాజరు కావలసొచ్చింది.

ఒకేసారి దంపతులిద్దరూ ఆఫీసుకు వెళ్ళేవారు. వడివంబల్ మనవ నికి స్నానం చేయించి పాలు త్రాగించి ఊయల ఊపుతూ నిద్రపుచ్చేది. బట్టలను మడతవేసేది. ఇల్లు చిమ్మి తుడిచేది. మనవడు నిద్ర నుండి లేస్తే వాణ్ణి చూసుకునేది. వంటగదిలో నేలను జిడ్డులేకుండా కడిగేది. వంట చేసేది. కొద్దిగా తిని నిట్టూర్చి కాళ్ళు చాచుకొని మధ్యాహ్నం మూడు గంటలవరకు కూర్చొనేది. అనుకోకుండా కాలింగ్‌బెల్ మ్రోగింది. బయటకి తొంగి చూసింది.

"ఎదురింటావిడ" వడివంబల్ ఇంతకుముందు వచ్చినపుడు పరిచయమయింది.

తలుపు తెరిచి లోనికి రమ్మంది నవ్వుతూ.

"ఎలా వున్నావు ఆంటీ?" నిన్నరాత్రి వచ్చినట్లున్నావు కదా. రైలు ప్రయాణం చేసి అలసిపోయుంటావని ఉదయం రాలేదు. ఎందుకంటే నిన్ను ఇబ్బంది పెట్టకూడదనుకున్నా..." అంది. వచ్చినావిడ ఇల్లంతా కలయజూసింది.

ఇప్పుడు ఇది ఒక ఇల్లయింది, ఇప్పటినుండి ఉషకు ఇబ్బంది వుండదు. ఈ రెండు నెలలు సరైన సహాయం లేక చాలా ఇబ్బంది పడింది. ఇల్లు, వంట, కుమారుడు, ఆఫీసు పని... ఆమె నిజంగా కష్టపడుతోంది. నమ్మి పిల్లవాణ్ణి ఎవరికి ఇవ్వదు... ఈ నగరంలో పిల్లలకు నిద్రమాత్రలు, బ్రాందీ యిచ్చి జులాయిగా తిరిగే ఆయాల గురించి కథలెన్నో వున్నాయి. ఉష తల్లి జబ్బుపడి మంచంపై వుంది. వృద్ధురాలు, ఉష నిజంగా కష్టపడుతోంది. మీ అత్తగారిని రమ్మనమని చెప్పకూడదా?" అని నేనే మిమ్మల్ని రప్పించాను. వడివంబల్ మదిలో ఏదో మెదిలింది. అందువల్లనా... నన్ను ఇక్కడికి తీసుకురావటం. నిజంగా నేను ఒంటరిగా కష్టపడుతున్నానని కాదు. లేక నేను వారిదగ్గర జీవించాలని కోరుకోవటం కాదు?

వారికి నమ్మకమైన ఆయా కావాలి. నా గురించి ఏమనుకున్నారు కంటనీరు కంటిలోనే దిగమ్రింగి చెప్పింది "దయచేసి కూర్చోండి. ఇంతవరకు నిలబడే మాట్లాడుతున్నారు..." ఆమెకు బాధతో గొంతు బొంగురువోయింది.

